సాక్షి మంచిర్యాల

ఆదివారం । 12 । మార్చి । 2023



మళ్లీ ప్రాణం పోసేలా.. 8లో▸

సడెన్ కార్డియాక్ అరెస్ట్ కేసులు పెరుగుతున్నాయి. గుండెపోటు వచ్చిన వ్యక్తులకు వైద్యం అందేలోపు సీపీఆర్ చేస్తే ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.



మనసున్న మారాజులు

మనిషి మాయమైపోతున్నవేళ అక్కడక్కడ మనసున్న, మానవత్వమున్న వారు మెరుస్తూనే ఉన్నారు. మనీతో కాకుండా మనసుతో ఆలోచిస్తున్నాడు. 10లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
36.3 /21.0

ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. చలి ప్రభావం ఉండదు.

భద్రత మాటున.. బాదుడు!



రోడ్డు పక్కన ఉండి ఫొటోలు తీస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్



ఈ చిత్రంలో కనిపిస్తున్న ద్విచక్ర వాహనంపై 69 చాలాన్లు పెండింగ్‌లో ఉన్నాయి. చలాన్ల నగదు మొత్తం రూ.26,615. వాహన యజమాని పెండింగ్ చలాన్లు చెల్లించకపోవడంతో ట్రాఫిక్ పోలీసులు వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. యజమాని కూడా వాహనం వదిలేసి వెళ్లిపోయాడు. పోలీసులు నోటీసులు పంపినా వాహనదారుడి నుంచి స్పందన లేదు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న ద్విచక్రవాహనం (స్కూటీ)పై 57 చలాన్లు పెండింగ్‌లో ఉన్నాయి. వీటికిగాను రూ.26,360 చెల్లించాల్సి ఉంది. ట్రాఫిక్ పోలీసులు ఇటీవల నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడింది. పెండింగ్ చలాన్లు చెల్లించాలని పోలీసులు ఒత్తిడి చేయగా, వాహనదారుడు బండి వదిలేసి వెళ్లిపోయాడు. పోలీసులు వాహనం సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నోటీసులు పంపినా యజమాని నుంచి స్పందన లేదు.

- ట్రాఫిక్ రూల్స్ పేరుతో ఇష్టానుసారం జరిమానా
- ఫొటోలు దించడమే లక్ష్యంగా ట్రాఫిక్ పోలీసులు
- ట్రాఫిక్ నియంత్రణపై నిర్లక్ష్యం
- కెమెరాకు చిక్కకుండా తప్పించుకుంటున్న వారిపై నిఘా
- అయినా మారని వాహనదారుల తీరు

రెండేళ్లలో నమోదైన కేసులు..

కేసులు	2021	2022
నమోదైన కేసులు	1,91,176	82658
విధించిన జరిమానా	రూ.6,61,72,460	రూ.2,76,22,390
జరిమానా చెల్లించిన కేసులు	1,43,457	30,951
చెల్లించిన జరిమానా	రూ.5,02,06,610	రూ.1,15,98,885
చెల్లించాల్సిన కేసులు	47,719	51,707
చెల్లించాల్సిన జరిమానా	రూ.1,59,65,850	రూ.1,60,23,505



చలానా కట్టించే పనిలో పోలీసులు..

గతంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసులు అక్కడికక్కడే కేసులు నమెదు చేయడం, మోటార్ వేహికాల్ యాక్ట్ ప్రకారం జరిమానాలు విధిస్తూ వెంటనే నగదు రూపంలో డబ్బులు కటించుకునేవారు. ఇప్పుడు నగదు చెల్లించకుండా ఈ-చలాన్ ద్వారా ఆన్‌లైన్‌లో జరిమానా విధిస్తున్నారు. వాహనదారులకు జరిమానా పడినట్లు తెలిసినా వాటిని చెల్లించడం లేదు. కొన్ని వాహనాలపై రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు జరిమానా ఉండడమే ఇందుకు నిదర్శనం. దీంతో ట్రాఫిక్ పోలీసులు పెండింగ్ చలానాల వసూలుపై దృష్టి పెట్టారు. వాహనాలు తనిఖీ చేస్తూ చలానాలు పెండింగ్‌లో ఉంటే అవి చెల్లించే వరకూ వదిలిపెట్టడం లేదు. లేదంటే వాహనం సీజ్ చేస్తున్నారు. చలానా వసూళ్లలో పోలీసులు ఏమాత్రం కనికరం చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని వాహనాలకు వాహనం విలువ కంటే చలానాలే ఎక్కువగా ఉండడంతో నంబర్ ప్లేట్ తొలగించి తిరుగుతున్నారు. పట్టుబడినప్పుడు వాహనం వదిలేసి వెళ్లిపోతున్నారు.

ఒత్తిడి లేదు.. అయినా చెల్లించాల్సిందే..



వాహనదారులపై పెండింగ్ చలానాల చెల్లింపు కోసం ఒత్తిడి చేయడంలేదు. ఎంత వీలైతే అంత చెల్లించాలని ప్రోత్సహిస్తున్నాం. వాహనదారులు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నాం. నంబర్ ప్లేట్ లేకుండా, నంబర్ తొలగించి వాహనాలు వినియోగిస్తున్న వారిపై కఠిన చర్యలు తప్పవు. వాహనదారుల భద్రత కోసమే ఈచలానా విధిస్తున్నాం. అందరూ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలి.

– నరేశ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ, మంచిర్యాల

మంచిర్యాలక్రైం: రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల భద్రత, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన అంటూ పోలీసులు చలాన్లు బాదేస్తున్నారు. చేతిలో కెమెరా, ట్యాబ్ ఉంది కదా అని ఎక్కడ పడితే అక్కడ వీర బాదుడు బాదుతున్నారు. ఈ బాదుడులో ట్రాఫిక్, సివిల్ పోలీసులు పోటీ పడుతున్నట్లు కనిపిస్తోంది. ఇక ట్రాఫిక్ పోలీసులు అయితే చలానా విధించడం మీద చూపుతున్న శ్రద్ధ ట్రాఫిక్ నియంత్రణపై చూపడం లేదన్న విమర్శలున్నాయి.

అయినా హైవేలపై స్పీడ్ గన్‌తో పరిమితిని మించి వేగంతో వెళ్లే వాహనాలను గుర్తించేందుకు చెట్ల పొదల్లో నక్కి మరీ క్లిక్ మనిపిస్తున్నారు. పట్టణాల్లో తమకు కేటాయించిన ట్రాఫిక్ గార్డ్ క్యాబిన్‌లో దర్జాగా కూర్చుండి ఫొటోలు తీసే డ్యూటీ చేస్తున్నారు. మరికొన్నిచోట్ల అసలు ట్రాఫిక్ కానిస్టేబుల్ రోడ్డు పక్కన ఎవరికి కనిపించకుండా నిలబడి ఫొటోలు తీస్తున్నారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు ఫొటోలు తీయడం, చలానా విధించడమే విధిగా భావిస్తున్నట్లు అనిపిస్తోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం పోలీసులకు ఇస్తున్న వేతనాలు, ఇతర ఖర్చులన్నీ ఇలా చలానాల రూపంలోనే వసూలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

వాహనదారుల్లో కనిపించని మార్పు..

పోలీస్ శాఖపై విమర్శలు ఎలా ఉన్నా.. ఈ చలానా రూపంలో భారీగా జరిమానా విధిస్తున్నా వాహనదారుల్లో మార్పు మాత్రం కనిపించడం లేదు. కొందరు ట్రాఫిక్ పోలీసులు విధిస్తున్న జరిమానా నుంచి తప్పించుకునేందుకు అడ్డదారుల్లో వెళ్లడమే కాకుండా కొందరు తమ వాహనాలకు నంబర్ ట్యాంపర్ చేస్తున్నారని పోలీసులు పేర్కొంటున్నారు. ఇంకొందరు నిబంధనలు ఉల్లంఘించడమే కాకుండా, జరిమానా తప్పించుకునేందుకు నంబర్ ప్లేట్‌కు మాస్కు పెడుతున్నారని చెబుతున్నారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు సైతం తమ పంథా మార్చుకుని రూల్స్ పాటించని వారికి జరిమానా విధిస్తున్నారని పోలీస్ అధికారులు పేర్కొంటున్నారు. ఇక ఈచలానాలు పెండింగ్‌లో ఉన్నా చెల్లించకుండా మరికొందరు తప్పించుకు తిరుగుతున్నారని అంటున్నారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు బృందాలుగా విడిపోయి కొంతమంది చలానా విధిస్తుండగా, మరో బృందం పెండింగ్ చలానాల వసూలుపై దృష్టి పెడుతోంది.

ట్రాఫిక్ నియంత్రణపై నిర్లక్ష్యం...

ట్రాఫిక్ పోలీసులు ఈచలానా విధించడంపై చూపుతున్న శ్రద్ధలో కనీసం సగం కూడా ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై చూపడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లా కేంద్రం నుంచి రైలు మార్గం ఉండడంతో కుమురంభీం, మంచిర్యాల జిల్లాల ప్రజలతోపాటు మహారాష్ట్రకు చెందిన వారు సైతం వైద్యం, వ్యాపారం నిమిత్తం మంచిర్యాలకు రాకపోకలు సాగిస్తారు. మెడికల్ కాలేజీ, సిరామిక్స్ కంపెనీలు, భవన నిర్మాణరంగం, ఇటుక బట్టీలు, సింగరేణి, ఎస్టీపీపీ తదితర పరిశ్రమలు ఉండడంతో మహారాష్ట్ర, రాజస్థాన్, మధ్యప్రదేశ్ ప్రాంతాలకు చెందిన అనేక మంది ఇక్కడే జీవనం సాగిస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలు పెరిగి నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. పట్టణంలో రైల్వే స్టేషన్, మార్కెట్ రోడ్, శ్రీనివాస టాకీస్ రోడ్ ప్రాంతాల్లో గతంలో ట్రాఫిక్ పోలీసులు సంచరిస్తు రహదారులపై ట్రాఫిక్ అంతరాయం కలగకుండా విధుల్లో ఉండేవారు. ఇప్పుడు ప్రధాన చౌరస్తాల వద్ద మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వాళ్లు కూడా ట్రాఫిక్ నియంత్రణ కంటే.. ఫొటోలు తీయడం, ఈచలానాల వసూళ్లపైనే దృష్టి పెడుతున్నారు. మార్కెట్ ఏరియా, శ్రీనివాస్ టాకీస్ రోడ్‌లో, ముఖరాం చౌరస్తా వద్ద ట్రాఫిక్ పోలీసులు లేక పోవడంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది.

న్యూస్‌రీల్

ముగిసిన ప్రతిభ ప్రోత్సాహక పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులకు శనివారం నిర్వహించిన ప్రతిభ ప్రోత్సాహక పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. నాలుగు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 620 మంది హాజరు కావాల్సి ఉండగా, 16 మంది గైర్హాజరయ్యారు. మంచిర్యాల బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ రాహుల్ పరిశీలించారు. పరీక్ష ప్రశ్నపత్రంపై విద్యార్థులతో ముచ్చటించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా ప్రోత్సాహక పరీక్ష దిక్సూచి అన్నారు. విద్యార్థి అభ్యసనస్థాయి స్వీయ మూల్యాంకనం చేసుకునే అవకాశం ఇస్తూ, మరింత మెరుగుపర్చుకోవడానికి తోడ్పడుతుందని తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

లక్సెట్టిపేట: విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని అదనపు కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. లక్సెట్టిపేట, దండెపల్లి, జన్నారం ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌ను పరిశీలించారు. ఇలాంటి పరీక్షలతో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు తెలుస్తాయన్నారు. ఆయన వెంట ఎంఈవో రవీందర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

బీసీ ఫెడరేషన్లకు పాలక మండళ్లు ఏర్పాటు చేయాలి

- రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్‌కు లేఖ



లేఖ చూపుతున్న నాయకులు

పాతమంచిర్యాల: బీసీ ఫెడరేషన్లకు పాలక మండళ్లు నియమించాలని చట్టబద్ధత కల్పించాలని బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్ కోరారు. జిల్లా కేంద్రంలోని జన్మభూమినగర్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అనేక ఏళ్లుగా బీసీల డిమాండ్లపై పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వాలు స్పందించడం లేదన్నారు. తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ స్పందించాలని డిమాండ్ చేశారు. అనంతరం నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేయాలని బీసీ కమిషన్‌కు రాసిన లేఖను పోస్టు చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా నాయకులు సంగెం లక్ష్మణ్, రాసమల్ల కుమార్, కీర్తి భిక్షపతి, ఆరెందుల రాజేశం, కాగితాల సత్యనారాయణ, వెంకటేశ్, గుమ్ముల పోశం పాల్గొన్నారు.

కాళేశ్వరం ముంపు ప్రాంతాన్ని సందర్శించాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చెన్నూర్: చెన్నూర్ పర్యటనకు వస్తున్న ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు కాళేశ్వరం ముంపు ప్రాంతాలను పరిశీలించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల శ్రీనివాస్ కోరారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హరీశ్‌రావు భారీ నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని తెలిపారు. ప్రాజెక్ట్ కారణంగా చెన్నూర్‌తోపాటు కోటపల్లి, జైపూర్ మండలాల్లోని పొలాలు బ్యాక్ వాటర్‌లో మునిగి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ముంపు కారణంగా ఇప్పటికే పది మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఆర్థికశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న హరీశ్‌రావు ముంపు ప్రాంతాలను పరిశీలించి రైతులకు పరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పెద్దపల్లి పార్లమెంట్ కోకన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, అంసెబ్లీ కన్వీనర్ రమేశ్, చెన్నూర్ పట్టణ అధ్యక్షుడు సుశీల్‌కుమార్, మండల అధ్యక్షుడు ఆలం బాపు, జైపూర్ అధ్యక్షుడు విశ్వంభర్‌రెడ్డి, నాయకులు వంశీ, శివకృష్ణ, ప్రవీణ్ నాయక్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పార్క్ పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీలో ఈనెల 15 న ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేయనున్న కేసీఆర్ పార్క్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మినీ ట్యాంక్‌బండ్, నాలుగు వరుసల రోడ్డు, మినీస్టేడియం ప నులను అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ శనివారం పరిశీలించారు. 14 తేదీ మధ్యాహ్నం వరకు పనులన్నీ పూర్తి చేయాలని అధికారుల ను ఆదేశించారు. సమయం తక్కువగా ఉ న్నందున నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ గంగాధర్, తహసీల్దార్ శ్రీనివాస్‌దేశ్‌పాండే, ఏఈ సాయికిరణ్, ప్రభుత్వ విప్ కార్యదర్శి మనోహర్‌రావు ఉన్నారు.

మంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

భీమారం:మంత్రి హరీశ్‌రావు ఈనెల 15న మండలంలో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను మంచిర్యాల డీసీపీ సుధీర్‌కేకన్ రామనాథ్ శనివారం పరిశీలించారు. జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న ర్యాంపులను తొలగిస్తున్నామని ఎస్సై సుధాకర్ డీసీపీకి తెలిపారు. మంత్రి ప్రజలతో మాట్లాడే ప్రదేశాలను డీసీపీ పరిశీలించారు. ఆయన వెంట జైపూర్ ఏసీపీ నరేందర్, శ్రీరాంపూర్ సీఐ రాజు, ఎస్సై సుధాకర్ ఉన్నారు.

జైపూర్ మండలంలో..

జైపూర్: ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పర్యటన ఏర్పాట్లను జైపూర్ ఏసీపీ నరేందర్ పరిశీలించారు. ఇందారం రోడ్డు వద్ద రూట్‌మ్యాప్ పరిశీలించారు. ఇందారం చెక్‌పోస్ట్ వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్‌ను పరిశీలించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగకుండా తీసుకోవాల్సిన చర్యలను అధికారులకు సూచించారు.

ప్రజాచైతన్య యాత్ర విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి

పాతమంచిర్యాల: దేశాన్ని పాలిస్తున్న బీజేపీ దేశంలో మత ఘర్షణలు పెంచి లబ్ధిపొంది అధికారాన్ని సుస్థిరం చేసుకోవాలని చూస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి ఆరోపించారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీజేపీ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరిస్తోందని ఆరోపించారు. ప్రైవేటీకరణను తిప్పికొట్టేందుకు ఈనెల 23న ఆదిలాబాద్ నుంచి ప్రజాచైతన్య యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. యాత్ర ఈనెల 25న మంచిర్యాలకు చేరుకుంటుందని పేర్కొన్నారు. యాత్రను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు గోమాస ప్రకాశ్, దాగం రాజం, దుంపల రంజిత్, దూలం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాగులు ఖాళీ!



మందమర్రి శివారు పాలవాగులో ఇసుక తోడడంతో ఏర్పడిన గుంత

- గుట్టుగా ఇసుక రవాణా
- అధికారిక రీచ్‌లు లేక అక్రమంగా తరలింపు
- ఇంకా అందుబాటులోకి రాని రీచ్‌లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతోంది. అధికార రీచ్‌ల్లో అనధికార ట్రిప్పులు తరలిస్తుండగా, మిగతా చోట్ల రాత్రివేళ దొడ్డిదారిన వాగులు, గోదావరి తీరం నుంచి ఇసుక తరలించుకుపోతున్నారు. ప్రస్తుతం నెన్నెల మండలం కర్జీ వాగుకు అధికారికంగా అనుమతులు ఉన్నాయి. టీఎస్ఎండీసీ పరిధిలో కొల్లూరు రెండు క్వారీలు ఉన్నాయి. కానీ వాటిని స్థానికుల అవసరాల కోసం తీసుకునే అవకాశం తక్కువ. గోదావరి తీర ప్రాంతాల ప్రజలకు స్థానికంగానే ఇసుక అందించాలనే ఉద్దేశంతో ముల్కల్లలోనూ రీచ్ ఉండేది. అయితే ఈ ఏడాది ఎక్కువ రోజులు నీటి నిల్వతో ఇసుక తీసేందుకు వీలు కాక కొన్ని చోట్ల ఆగిపోయాయి. ఈ సీజన్‌లో ఇంకా అధికారికంగా కొత్తగా ఎక్కడా ఇసుక అందుబాటులో రాలేదు. దీంతో కొందరు ట్రాక్టర్ల యాజమానులు దొడ్డిదారిన ఇసుక తరలిస్తున్నారు. స్థానికంగా ఉన్న వాగులే అక్రమ రవాణాకు అడ్డాగా మారాయి.

- జిల్లా కేంద్రంలో గోదావరి తీరం నుంచి రాత్రి పూట యథేచ్ఛగా ఇసుక రవాణా సాగుతోంది. కాలేజీ రోడ్డు, పాత మంచిర్యాల వైపు ఇసుక ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. పట్టణంలో పలు చోట్ల డంప్ చేసి అవసరం ఉన్నవారికి పంపిస్తున్నారు. అంతకుముందు హాజీపూర్ మండలం ముల్కల నుంచి ఎక్కువగా జిల్లా కేంద్రానికి సరఫరా అయ్యేది. ఆ రీచ్ అందుబాటులోకి రాకపోవడంతో వేంపల్లిలో రీచ్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు చేశారు. అయితే వేంపల్లి శివారు నుంచి గోదావరి తీరం వెంట ఇసుక అక్రమంగా తరలిపోతోంది. ఇక జిల్లా కేంద్రం, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని రాళ్ల వాగులో నీటి నుంచే ఇసుక తోడేస్తున్నారు. ఇసుకను ఆరబోసి ట్రాక్టర్లలో సమీప ప్రాంతాలకు తీసుకెళ్తున్నారు. పట్టపగలే ట్రాక్టర్లలో తరలిస్తున్నారు.

వాగులే అడ్డాగా..

పట్టణ పరిసరాల్లోనే కాకుండా జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇసుక అక్రమంగా తరలిపోతుంది. దండేపల్లి, జన్నారం, లక్సెట్టిపేట పరిధిలోనూ గోదావరి నుంచి ఇసుక తరలిస్తున్నారు. జైపూర్‌లో రసూల్‌పల్లి పరిధిలో పెద్దవాగు, కిష్టాపూర్, వేలాల స మీపంలో గోదావరి నుంచి ఇసుక రవాణా అవుతోంది. అనేకసార్లు ఇక్కడ ఇసుక తరలిస్తున్న వాహనాల ను పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. చెన్నూరు మండలం బతుకమ్మ వాగు నుంచి ఇసుక తీస్తున్నారు. మందమర్రి పరిధిలో పాలవాగు, నెన్నెలలో కర్జీ వాగుల నుంచి ఇసుక అక్రమంగా తీసుకెళ్తున్నారు.



ఇటీవల ఆర్టీఏ అధికారులు సీజ్ చేసిన ట్రాక్టర్లు

ధ్రువపత్రాలు లేకున్నా అనుమతి?

ఇసుక రీచ్‌లలో నమోదు చేసుకున్న ట్రాక్టర్లకు అన్నీ రకాల అనుమతి పత్రాలు ఉండాలి. అలాంటి వాహనాలనే ఆన్‌లైన్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచాలి. ఆ వాహనాన్ని ఆన్‌లైన్‌లోనే బుక్ చేసుకోవాలి. అయితే వాహనాల ఫిట్‌నెస్, ట్యాక్స్, ఇన్సూరెన్సు పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సు లేకుండానే రవాణా చేస్తున్నారు. ఇటీవల నెన్నెల మండలం కర్జీలో ధ్రువపత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను ఆర్టీఏ అధికారులు సీజ్ చేశారు. ట్రాక్టర్లకు ధ్రువపత్రాలు లేకుండా గనుల శాఖలో ఓ కింది స్థాయి అధికారికి నెలకు ఒక ట్రాక్టరు రూ.2 వేలు ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న ముస్కె సమ్మయ్య

శ్రీరాంపూర్: సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు కోలిండియాలో ఇస్తున్నట్లుగా హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య డిమాండ్ చేశారు. ఆర్కే7 గనిపై సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో కాంట్రాక్ట్ కార్మికులతో మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులకు పండుగ దినాలు, జాతీయ సెలవు రోజుల్లో వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని, కంపెనీ ఆసుపత్రుల్లో పర్మినెంట్ కార్మికులకు అందిస్తున్నట్లు వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. కంపెనీ సాధించిన లాభాల్లో కాంట్రాక్టు కార్మికులకు వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచీ సెక్రెటరీ కొట్టె కిషన్‌రావు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ సెక్రెటరీ అఫ్రోజ్‌ఖాన్, నాయకులు చంద్రమోహన్, బూర వీరేశం, యస్ మల్లేశ్, సారయ్య, ప్రతాప్, బానేశ్ పాల్గొన్నారు.

కిడ్నీలను కాపాడుకోవాలి



మాట్లాడుతున్న డీవైసీఎంఓ రమేశ్‌బాబు

శ్రీరాంపూర్: మానవ శరీరంలో కిడ్నీలు ఎంతో కీలకమైన అవయవాలని శ్రీరాంపూర్ డీవైసీఎంవో రమేశ్ బాబు అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా ఆర్కే 8 డిస్పెన్సరీలో శనివారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రమేశ్‌బాబు మాట్లాడుతూ కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే రోజుకు ఐదు లీటర్ల నీరు తాగాలని సూచించారు. రక్తంలో గ్లూకోజ్ స్థాయిని ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలన్నారు. మధుమేహం, ధూమపానం, మద్యం సేవించే అలవాట్లతో కిడ్నీ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఎక్కువగా నొప్పి నివారణ మందులు వాడటం వల్ల కూడా కిడ్నీలు చెడిపోతాయని పేర్కొన్నారు. ఉద్యోగులు వీటిపై అవగాహన కలిగి ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గని మేనేజర్ అబ్దుల్‌ఖాదిర్, గని రక్షణాధికారి శివయ్య, సంక్షేమ అధికారి రణదీప్‌గౌడ్, వైద్యులు స్వప్న, ఏరియా ఎస్ఈ సతీశ్ చక్రవర్తి, పిట్ ఇంజినీర్ రాధాకృష్ణ, పిట్ సెక్రెటరీ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్కే 5 గనిపై..

ఆర్కే 5 గనిపై కిడ్నీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా హెల్త్ ఆఫీసర్ లోక్‌నాథ్‌రెడ్డి కిడ్నీల పనితీరు, అవి ఎలా దెబ్బతింటాయి, వాటిని ఎలా సంరక్షించుకోవాలో వివరించారు. రక్తాన్ని శుద్ధి చేయడంలో కీలక పాత్ర వహించే కిడ్నీలకు కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గని మేనేజర్ అబ్దుల్‌ఖాదిర్, అండర్ మేనేజర్లు ఎల్లయ్య, రాజేశ్, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, పిట్ సెక్రెటరీ మహేందర్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

‘బండి’పై భగ్గుమన్న బీఆర్ఎస్



జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మంచిర్యాలటౌన్: ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ మంచిర్యాల పట్టణ బీఆర్ఎస్ మహిళా నేతలు శనివారం ఆందోళ చేశారు. ముందుగా సంజయ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఐబీ చౌరస్తా వ రకు ర్యాలీగా వెళ్లి రాస్తారోకో చేశారు. బండి సంజయ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశా రు. దిష్టిబొమ్మ దహనం చేశారు. నిరసనలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పల్లపు తిరుపతి, మహిళా అధ్యక్షురాలు గరిగంటి సరోజ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మామిడిశెట్టి వసుంధర, అత్తి సరోజ, కౌన్సిలర్లు మోతె సుజాత, హఫీ జా బేగం, సుంకరి శ్వేత, అంకం నరేశ్, సురేశ్ బల్దువా, మాదంశెట్టి సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

రామకృష్ణాపూర్(చెన్నూర్): పట్టణంలోని 1వ వార్డు తారకరామకాలనీలో శనివారం వీధికుక్కలు వీరంగం సృష్టించాయి. కాలనీకి చెందిన రాజేశ్వరి, హుస్సేన్‌బీ, సంధ్యలపై ఒక్కసారిగా దాడిచేసి గాయపర్చాయి. బాధితులు స్థానిక ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో కుక్కల బెడద తీవ్రంగా ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని, ఇప్పటికైనా కుక్కల నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రైలు ప్రమాదం నుంచి తృటిలో బయటపడ్డాడు



వ్యక్తిని బయటకు లాగుతున్న స్థానికులు

మంచిర్యాలక్రైం: రైలు ప్రమాదం నుంచి ఓ వ్యక్తి తృటిలో బయటపడిన ఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలో శనివారం జరిగింది. మహారాష్ట్రలోని చంద్రపూర్ గుగ్గాసకు చెందిన బొజ్జం కుమారస్వామి మంచిర్యాల పట్టణంలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు శనివారం మంచిర్యాల రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. రప్తిసాగర్ రైలు ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి ప్లాట్‌ఫాం, రైలు మధ్యలో ఇరుక్కుపోయాడు. గమనించిన స్థానికులు కుమారస్వామిని కష్టంగా బయటకు తీశారు. రైలు కదులుతుండగా పడిపోయి ఉంటే ఘోరం జరిగేదని స్థానికులు తెలిపారు.

వలస కూలీ ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: స్థానిక హమాలివాడలో నివాసం ఉంటున్న వలస కూలీ ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం నెన్నెల మండలం ఖర్జి గ్రామానికి చెందిన చింత మహేష్(42) మూడేళ్లక్రితం కుటుంబంతో కలిసి మంచిర్యాలకు వలస వచ్చాడు. హమాలివాడలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ కూలిపనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం మహేశ్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య సైన, కుమారులు హర్షచరణ్, హనుష్ ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

మంచిర్యాలక్రైం: మంచిర్యాలకు చెందిన వృద్ధుడు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్సై రామారావు తెలిపారు. గోపాల్‌వాడకు చెందిన భూతం లింగయ్య (85) పక్షవాతం వచ్చి మంచానికే పరిమితమయ్యాడు. ఈ నెల 5న లింగయ్య బీడీ తాగి మీద పడేసుకోవడంతో శరీరం కాలిపోయింది. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేశారు. చికిత్స పొందుతుండగా శనివారం మృతి చెందాడు.

గంగిపెల్లిలో యువకుడు..

జైపూర్(చెన్నూర్): మండలంలోని గంగిపెల్లి గ్రామానికి చెందిన అట్ల ప్రశాంత్ (32) ఈ నెల 5న ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. ఈఎస్‌ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

మళ్లీ ప్రాణం పోసేలా..

- సీపీఆర్‌తో ఆగిన గుండెకు ఊపిరి
- ఇటీవల పెరిగిన గుండెపోటు మరణాలు
- అప్రమత్తమై డాక్టర్లకు శిక్షణ ఇస్తున్న వైద్యశాఖ
- ఈ నెలలో సిబ్బందికి, ఆ తర్వాత ఇతర శాఖల్లోనూ తర్ఫీదు

నిర్మల్‌చైన్‌గేట్: దేశవ్యాప్తంగా సడెన్ కార్డియాక్ అరెస్ట్ కేసులు పెరుగుతున్నాయి. నిత్యం పలువురు గుండెపోటుతో చనిపోతున్నారు. యుక్త వయస్సులో ఉన్నవారు, చిన్నారులు కూడా మృత్యువాత పడుతున్నారు. హార్ట్ ఎటాక్ వచ్చిన వారికి వెంటనే సీపీఆర్ చేస్తే బతికే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమై గుండెపోటు సంఘటనలపై జాగ్రత్తగా ఉండాలని, సీపీఆర్ చేసే విధానంపై దృష్టి సారించాలని వైద్యశాఖకు ఆదేశాలు జారీ చేసింది. గుండెపోటు వచ్చిన వ్యక్తులకు వైద్యం అందేలోపు సీపీఆర్ ప్రక్రియ నిర్వహిస్తే ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఎస్పీ (ఫైల్)

- గత నెల 26న నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని పార్డి(కె)లో పెళ్లి బరాత్‌లో పెళ్లి కుమారుని బంధువైన మహారాష్ట్రలోని శివుని గ్రామానికి చెందిన ముత్యం(18) అనే యువకుడు డ్యాన్స్ చేస్తూ ఒక్కసారిగా కుప్ప కూలాడు. గమనించిన స్థానికులు యువకుడిని లేపి పరిశీలించగా అపస్మారక స్థితికి చేరుకున్నాడు. హుటాహుటిన భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.
- గత నెల 27న నిర్మల్ జిల్లా ముధోల్ మండలంలోని చించాలలో ఒకేరోజు ఇద్దరు వ్యవసాయ కూలీలు గుండెపోటుతో మృతి చెందారు. వరగంటి లక్ష్మణ్ (33) ఆదివారం రాత్రి 11 గంటలకు గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలిసిన గ్రామస్తులతో పాటు కండెల రాఘవులు (42) మృతున్ని చూసేందుకు వెళ్లారు. ఇంటికి తిరిగివచ్చిన రాఘవులు 12 గంటల ప్రాంతంలో గుండెపోటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే భైంసాలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.
- ఈ నెల 9న నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం మస్కాపూర్ గ్రామానికి చెందిన ప్రధానోపాధ్యాయుడు చిలుకూరి విజయేందర్ (51) గుండెపోటుతో మృతి చెందాడు. పెంబి మండలం మందపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న విజయేందర్ విధులకు వెళ్లేందుకు ఉదయం ఇంట్లో సిద్ధమవుతుండగా ఒక్కసారిగా కుప్పకూలాడు. కుటుంబీకులు స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం నిర్మల్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.
- ఈ నెల 11న మంచిర్యాల జిల్లా జన్నారం మండలం రూప్‌నాయక్‌తండాకు చెందిన బూక్యా దశరథ్‌నాయక్ (51) గుండెపోటుతో మృతి చెందాడు. కవ్వాల్ బాలికల ఆశ్రమ పాఠశాల వార్డెన్‌గా పనిచేస్తున్న దశరథ్ నాయక్ జన్నారం పాఠశాల ఇన్‌చార్జి వార్డెన్‌గా కూడా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి విపరీతమైన దగ్గుతో పాటు చాతిలో నొప్పిరావడంతో కుటుంబ సభ్యులు జన్నారం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో లక్సెట్టిపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

సీపీఆర్ ఎలా చేయాలంటే?

సీపీఆర్.. (కార్డియో పల్మనరీ రీససిటేషన్) గుండె పనితీరు అకస్మాత్తుగా ఆగిపోయేటప్పుడు, ఆగిపోయిన వారికి వెంటనే పంప్ చేసేందుకు ఈ ప్రక్రియ చేపడతారు. సీపీఆర్ చేసేటప్పుడు బాధితుడిని బల్లపరుపుగా ఉన్న స్థలంలో పడుకోబెట్టాలి. ఎడమచేతి వేళ్ల మధ్య కుడిచేతి వేళ్లు లేదా కుడిచేతి వేళ్ల మధ్య ఎడమచేతి వేళ్లు జొప్పించి బాధితుడి ఛాతి (గుండెపై కాదు)మధ్య భాగంలో నొక్కాలి. క్రమంగా ప్రెస్ చేస్తూ ఉండాలి. నొక్కేటప్పుడు మన చేతులు, మోచేతులు అసలు బెండు కాకూడదు. చేతులు స్టిఫ్‌గా ఉంచి నొక్కాలి. బాధితుడి ఛాతి కనీసం ఐదు సెంటీమీటర్లు లోపలికి వెళ్లేలా నొక్కాలి. ఎముకలు విరిగిపోతాయని భయపడకూడదు. నిమిషానికి వందసార్లు ప్రెస్ చేశాక పల్స్ చెక్ చేయాలి. పల్స్ దొరకకపోతే మళ్లీ ఆ ప్రక్రియ కొనసాగించాలి. ఇలా ఒక్కోసారి 20 నుంచి 30 నిమిషాల వరకు చేస్తూనే ఉండాలి. కంటిన్యూస్‌గా చేస్తున్నప్పుడు గుండె మళ్లీ కొట్టుకునే అవకాశం ఉంటుంది. హార్ట్ ఎటాక్ వచ్చిన వెంటనే సీపీఆర్ చేస్తే ప్రయోజనం ఉంటుంది. ఆలస్యం చేస్తే లాభం ఉండదు. ఇవి చేస్తూనే అంబులెన్స్‌లకు సమాచారం ఇవ్వాలి.

వైద్యసిబ్బందికి శిక్షణ ఇస్తాం



ఇటీవల గుండెపోటు మరణాలు ఎక్కువగా సంభవిస్తుండడంతో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. జిల్లాలోని ఐదుగురు వైద్యులకు ఇటీవల హైదరాబాద్‌లో సీపీఆర్‌పై శిక్షణ అందించారు. జిల్లాలోని వైద్యులు, వైద్య సిబ్బందికి ఆ ఐదుగురు వైద్యులతో శిక్షణను ఇవ్వాల్సి ఉంది. ఇంకా తేదీని నిర్ణయించలేదు. దశల వారీగా అందరికీ సీపీఆర్‌పై శిక్షణ అందిస్తాం. – డాక్టర్ సుబ్బరాయుడు, జిల్లా వైద్యాధికారి, మంచిర్యాల

అవగాహన పెంచుకోవాలి



గుండెపోటు వచ్చిన సమయంలో సీపీఆర్ ప్రక్రియ చాలా ప్రధానమైనది. ఆలస్యం చేయకుండా వెంటనే చేతులతో కొన్ని నిమిషాల పాటు ప్రెస్సింగ్ చేస్తే తిరిగి గుండె పనిచేస్తుంది. ఈ ప్రక్రియ ద్వారా మనిషి ప్రాణాలను తిరిగి నిలబెట్టవచ్చు. సీపీఆర్‌పై అందరూ అవగాహన పెంచుకోవాలి.
– డాక్టర్ రత్నాకర్, ఎండీ జనరల్ ఫిజీషియన్, సర్వజన ఆస్పత్రి, నిర్మల్

బతికే అవకాశం ఉంది



ఎవరైనా గుండెపోటుకు గురై హఠాత్తుగా పడిపోతే సీపీఆర్ చేయడంతో బతికే అవకాశాలు ఉన్నాయి. రెండు చేతులతో రోగి ఛాతిపై బలంగా నొక్కాలి. ఇలా 20 నుంచి 30 సార్లు చేయడం వల్ల రక్త ప్రసరణ జరిగి గుండె మళ్లీ కొట్టుకునే అవకాశం ఉంటుంది. వెంటనే రోగిని దవాఖానాకు తీసుకెళ్లాలి.
– డాక్టర్ అరుణ్ మోరే, గుండె వైద్యనిపుణుడు, డీవీఆర్ హాస్పిటల్, నిర్మల్

మాస్టర్ ట్రైనింగ్ పూర్తి

ఈ నెల 1న మంచిర్యాల జిల్లాలోని ఐదుగురు ప్రభుత్వ వైద్యులకు ఇటీవల హైదరాబాద్‌లో మాస్టర్ ట్రైనింగ్ అందించారు. పాతమంచిర్యాల యూపీహెచ్‌సీ డాక్టర్ రమేశ్, షంశేర్‌నగర్ యూపీహెచ్‌సీ డాక్టర్ సృజన్, దండేపల్లి పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సతీశ్, జైపూర్ పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ అనిల్, వేమనపల్లి పీహెచ్‌సీ డాక్టర్ రాజేశ్ శిక్షణ పొందారు. నిర్మల్ జిల్లాలో వెల్మల్, పెంబి, కుంటాల, బాసర పీహెచ్‌సీ వైద్యులకు శిక్షణ ఇచ్చారు. మున్సిపల్, పోలీస్, రెవెన్యూతో పాటు ఇతర శాఖల సిబ్బందికి పలు దఫాలుగా శిక్షణ అందించనున్నారు.

అకస్మాత్తుగా ఎందుకు ఆగిపోతుంది..

ఊపిరితిత్తుల్లో రక్తం గడ్డ కట్టడం, గుండె కొట్టుకోవడంలో సమస్యలు ఏర్పడటం, గుండె కండరం దళసరిగా ఉండడం, ఒత్తిడి వంటి ఏదో కారణంతో సడన్ కార్డియాక్ అరెస్ట్ ఏర్పడుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. మనం తినే ఆహారం కూడా గుండెపోటు రావడానికి కారణమంటున్నారు. సడన్ కార్డియాక్ అరెస్ట్‌కు గురైతే గుండె మొత్తం ఒకేసారి పనిచేయడం ఆగిపోయి నిమిషాల వ్యవధిలోనే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. జంక్‌ఫుడ్, స్థూలకాయం, ధూమపానం, అధికంగా మద్యం సేవించడం, మానసిక ఒత్తిడి, రక్తపోటు, మధుమేహం కారణంగా గుండె వ్యాధి లేని వారు కూడా సడన్ కార్డియాక్ అరెస్ట్ బారిన పడుతున్నారు. రోజూ వ్యాయామం చేస్తే కార్డియాక్ అరెస్ట్ బారిన పడకుండా కొంతవరకు కాపాడుకునే అవకాశం ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు.

‘గిరి’ మహిళలకు ‘స్టార్ లెజెండ్’

- అవార్డుకు ఎంపికైన కన్నిబాయి, సోంబాయి
- ఆదివాసీ బిడ్డలకు దక్కిన గౌరవం



అవార్డును ప్రదానం చేస్తున్న సువర్ణకుమారి

కెరమెరి(ఆసిఫాబాద్): కుమురం భీం జిల్లా కెరమెరి మండలంలోని భీమన్‌గోంది గ్రామానికి చెందిన మడావి కన్నిబాయి సేవా కార్యక్రమాలతో పాటు, కొలాం ఆదివాసీల జీవిత చరిత్ర, వారు పడుతున్న కష్టాలను అధికారులు దృష్టికి తీసుకువెళ్లి చూపారు. సాహస కృత్యాల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిల్లో పలు పతకాలు సాధించారు. అడ్వెంచర్ క్లబ్‌కే బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారు. విశ్వంబరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తాళ్లూరి సువర్ణకుమారి శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో మడావి కన్నిబాయి, కుమురం భీం మనవరాలు కుమురం సోంబాయికి ×జాతీయ మహిళా స్టార్ లెజెండ్‌* అవార్డును అందజేశారు. ఇరువురిని శాలువాలతో సత్కరించి ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంతోశ్ కుమార్, పల్లం నవీన్‌కుమార్, స్వరూపరాణి, మాధవి, నీరజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమి పేరుతో శ్రమదోపిడీ



మాట్లాడుతున్న జీవన్‌జోయల్

శ్రీరాంపూర్: సింగరేణి అధికారులు జన్మభూమి పేరుతో కార్మికులను శ్రమ దోపిడీకి గురిచేస్తున్నారని హెచ్‌ఎమ్మెస్ శ్రీరాంపూర్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు జీవన్‌జోయల్ ఆరోపించారు. ఆర్కే న్యూటెక్ గనిపై శనివారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ఉదయం ఫస్ట్ షిఫ్ట్‌లో కార్మికులు మస్టర్ పడిన తర్వాత డిస్ట్రిబ్యూషన్ చేయకుండా జన్మభూమి పేరుతో సర్ఫేస్ నుంచి లోపలికి తరలించే సామగ్రిని టబ్బుల్లో లోడ్ చేయిస్తున్నారని తెలిపారు. ఇలా ఇతర పనులు చేయించడం అధికారులకు అలవాటుగా మారిందని పేర్కొన్నారు. దీనిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రక్షణ పేరుతో కార్మికులకు ఇస్తున్న రేడియం జాకెట్లు చిరిగి పోతున్నాయన్నారు. నాణ్యమైనవి ఇవ్వాలన్నారు. భూపాలపల్లిలో జరిగిన మిస్‌ఫైర్ ప్రమాదంలో ఓ షాట్‌ఫైరర్‌ను డిస్మిస్ చేయడం, సర్దార్‌కు 8 ఇంక్రిమెంట్లు కట్ చేయడం, ఓవర్‌మెన్‌ను డీ ప్రమోట్ చేయడం అన్యాయమన్నారు. దీనిని అడ్డుకోవడంలో గుర్తింపు సంఘం, ప్రాతినిధ్య సంఘాలు టీబీజీకేఎస్, ఏఐటీయూసీ పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. గైర్హాజరు పేరుతో కార్మికులను డిస్మిస్ చేస్తున్నా అడ్డుకోవడం లేదని విమర్శించారు. కార్మికుల సమస్యలపై పోరాడకుండా యాజమాన్యానికి తొత్తుగా మారుతున్న ఈ సంఘాలకు వచ్చే గుర్తింపు సంఘం ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. సింగరేణిలో కొత్త గనులు తేవాలని, బొగ్గు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి ఈ ప్రాంత యువకులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ బ్రాంచి కార్యదర్శి తిప్పారపు సారయ్య, ఫిట్ సెక్రెటరీ బొద్దు సురేందర్, నాయకులు రాజేంద్రప్రసాద్, ఎం.కొమురయ్య, కంబాల నర్సయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ క్వాలిఫైడ్ రెఫరీగా పార్‌పల్లి వాసి



ప్రేమ్‌కుమార్

కోటపల్లి(చెన్నూర్): రాష్ట్రస్థాయి వాలీబాల్ క్వాలిఫైడ్ రెఫరీగా మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని పార్‌పెల్లి గ్రామానికి చెందిన బోగె ప్రేమ్ కుమార్ ఎన్నికయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో నిర్వహించిన స్టేట్ లెవల్ వాలీబాల్ రిఫరీ పరీక్షల్లో జిల్లాల వారీగా ఉత్తీర్ణత అభ్యర్థుల పేర్లను ప్రకటించగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి కోటపల్లి మండలం పార్‌పల్లి గ్రామానికి చెందిన బోగే ప్రేమ్‌కుమార్ అర్హత సాధించినట్లు ఉమ్మడి ఆదిలాబాద్ వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్ల శంకర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాస్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్‌ను జిల్లా కోచ్ రాంమోహన్, శ్రీనివాస్, సందీప్, అంజి అభినందించారు.

ఆశ్రమ పాఠశాల వార్డెన్ హఠాన్మరణం



దశరథ్‌నాయక్ (ఫైల్)

జన్నారం(ఖానాపూర్): మండలంలోని రూప్‌నాయక్ తండాకు చెందిన బూక్యా దశరథ్ నాయక్ (51) శనివారం తెల్లవారు జామున హఠాన్మరణం చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు కవ్వాల్ బాలికల ఆశ్రమ పాఠశాల వార్డెన్‌గా, జన్నారం ఆశ్రమ పాఠశాల ఇన్‌చార్జి వార్డెన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం విధులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చాడు. రాత్రి 2 గంటల ప్రాంతంలో విపరీతంగా దగ్గుతో పాటు చాతిలో నొప్పి వస్తుందని భార్యకు చెప్పడంతో వెంటనే జన్నారం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో లక్సెట్టిపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఉన్నతాధికారుల ఒత్తిడితోనే దశరథ్ నాయక్ గుండెపోటుతో మృతి చెందాడని, ఒత్తిడికి గురిచేసిన అధికారులపై కేసులు నమోదు చేయాలని వీబీఏ జిల్లా అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ డిమాండ్ చేశారు.

వార్షిక ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలి



ఖైరిగూడ ఓసీపీని సందర్శిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, జీఎం కొండయ్య

రెబ్బెన(ఆసిఫాబాద్): ఆర్థిక సంవత్సరంలో బెల్లంపల్లి ఏరియాకు నిర్దేశించిన వార్షిక ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు అధికారులు, ఉద్యోగులు కృషి చేయాలని సింగరేణి డైరెక్టర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు) జి.వెంకటేశ్వరరెడ్డి సూచించారు. జీఎం (పీఅండ్‌పీ) కొండయ్యతో కలిసి బెల్లంపల్లి ఏరియాలో శనివారం పర్యటించారు. ఖైరిగూడ ఓసీపీని సందర్శించారు. ఏరియాలో కొనసాగుతున్న ఉత్పత్తి ఉత్పాదకతతోపాటు సివిల్ పనులపై ఏరియా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం వచ్చే ఆర్థిక సంవత్సరం ఉత్పత్తి లక్ష్యాలపై ఏరియా అధికారులకు మార్గనిర్దేశం చేశారు. అనంతరం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఏరియా జీ ఎం దేవేందర్, ఖైరిగూడ పీవో ఉమాకాంత్, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కల్చరల్ ఫెస్ట్ నిర్వహణ అభినందనీయం



మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్

ఉట్నూర్(ఖానాపూర్): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహించేందుకు కల్చరల్ ఫెస్ట్ నిర్వహించడం అభినందనీయమని జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. శనివారం ఐటీడీఏ ఆధ్వర్యంలో కుమురంభీం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దడం కోసం గిరిజన సంక్షేమ శాఖ చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని రంగాల్లో విద్యార్థులకు అవగాహన కలిగించేలా కార్యక్రమం రూపొందించామన్నారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు గిరిజన క్రీడోత్సవాలు, సైన్స్ ఫెర్ ప్రదర్శనలు, మార్చిలో కల్చరల్ ఫెస్ట్ లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన 51 మంది విద్యార్థులకు ప్రశంస పత్రాలతో పాటు జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు దిలీప్‌కుమార్, ఉట్నూర్, భీంపూర్ జెడ్పీటీసీలు చారులత, సుధాకర్, డీటీడీవోలు మణెమ్మ, నీలిమ, ఏసీఎమ్‌వో జగన్ పాల్గొన్నారు.